క్లుప్తంగా

జయప్రకాష్ నారాయణ జయంతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జేపీఎన్‌సీలో సోమవారం ఘనంగా జయప్రకాష్ నారాయణ జయంతి నిర్వహించారు. ఈమేరకు కళాశాల చైర్మన్ రవికుమార్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ లింగన్ గౌడ్, కులకర్ణి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: హైదరాబాద్‌లో నవంబర్ 11న నిర్వహించే మాదిగ, ఉపకులాల విశ్వరూప మహాసభకు సంబంధించిన పోస్టులను ఎంఎస్ఎఫ్ నాయకులు పీయూలో ఆవిష్కరించారు. నాయకుడు మీసాల గణేష్, అధ్యాపకుడు భూమయ్య, ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు పవన్, ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు మహేష్, దేవరాజ్, లేపాక్షి, మహేష్ పాల్గొన్నారు.

వ్యవసాయరంగంలో ట్రాక్టర్లది ప్రముఖపాత్ర



స్టేషన్ మహబూబ్‌నగర్: వ్యవసాయ రంగంలో ట్రాక్టర్లది ప్రముఖ పాత్ర అని ఆలిండియా ట్రాక్టర్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాడి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ కార్యాలయం ఎదుట సోమవారం ట్రాక్టర్ ప్రాధాన్యత కరపత్రాలను ప్రదర్శించారు. పట్టణ అధ్యక్షుడు శంకరన్న, మోహన్‌రెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను నమ్మవద్దు



రాజాపూర్: 'స్థానికుడిగా మీ బిడ్డగా..నా బిడ్డను గెలిపించండి' అని సోమవారం మండలకేంద్రంలో కాంగ్రెస్ అభ్యర్థి అనిరుధ్‌రెడ్డి మాతృమూర్తి రంగారెడ్డిగూడ సర్పంచ్ శశికళారెడ్డి ప్రచారం నిర్వహించారు. జడ్చర్లలో ఎందరో స్థానికేతరులు ఎమ్మెల్యేలుగా ఉన్నారని అన్నారు. స్థానికుడైన తన తనయుడికి ఒకసారి అవకాశమివ్వాలని కోరారు. బీఆర్ఎస్‌ను నమ్మవద్దన్నారు. నరహరి, కృష్ణయ్య, గోవర్ధన్‌రెడ్డి, విష్ణురెడ్డి పాల్గొన్నారు.

'గౌడ సంఘంతో సంబంధం లేదు'

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్‌కు సంఘానికి ఎలాంటి సంబంధం లేదని రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌రావుగౌడ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంఘం క్రమశిక్షణకు వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడని ఆరోపించారు. సంఘానికి ఆయన దూరంగా ఉండాలని సూచించారు.

విద్యార్థుల ప్రతిభ

జడ్చర్ల టౌన్: ఏనుగొండ చైతన్య సెంట్రల్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 17 ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నమెంట్‌లో పట్టణానికి చెందిన గీతాశ్రీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ప్రిన్సిపాల్ బాల్‌రాజ్, ఉపాధ్యాయ బృందం సోమవారం అభినందించారు.

నేడు గోవా సీఎం రాక

జడ్చర్ల: గోవా సీఎం ప్రమోద్ సావంత్ మంగళవారం జడ్చర్లకు విచ్చేయనున్నారు. జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్ నామినేషన్ దాఖలు చేయనున్న సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా రానున్నారు.

ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టొద్దు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ఏ నాడు ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచని నాయకులు ఎన్నికలు వస్తే గెట్ టూ గెదర్ పేరుతో వస్తున్నారని.. అలాంటి వారి వద్ద ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టొద్దని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల కాలంలో పీఆర్‌సీ, ఐఆర్, పదోన్నతులు, బదిలీల విషయంలో అన్యాయం జరిగిందని ఆరోపించారు. స్వార్థ ప్రయోజనాల కోసం సమావేశాలు ఏర్పాటు సరికాదన్నారు. జిల్లా మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కోయిల్‌కొండ: మండలంలోని వీరంపల్లి, ఆచార్యపూర్‌లో గ్రామాల్లో సోమవారం వరికొనుగోలు కేంద్రాలను డీపీఎం చెన్నయ్య ప్రారంభించారు. ఏపీఎం విజయకుమారి, సీసీ మల్లేష్, భద్రినాయక్, కవిత, రైతులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సెంటిమెంట్ కొనసాగేనా?

అచ్చంపేటలో గెలిచిన పార్టీదే అధికారం

- 12సార్లు ఇక్కడ గెలుపొందిన పార్టీనే ప్రభుత్వ ఏర్పాటు
- ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పార్టీలు
- ప్రధాన పార్టీల మధ్య హోరాహోరీ పోరు

అచ్చంపేట: అచ్చంపేట నియోజకవర్గంలో గెలిచిన పార్టీయే రాష్ట్రంలో అధికారంలోకి రావడం సెంటిమెంట్‌గా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ ఏర్పాటు తర్వాత కూడా ఈ సెంటిమెంట్ కొనసాగుతోంది. దీంతో అసెంబ్లీ ఎన్నికలను ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. పోటాపోటీగా ప్రచారాలు మొదలుపెట్టాయి. స్థానికంగా ఏ పార్టీ గెలిస్తే ఆ పార్టీ అధికారంలోకి వస్తుందన్న చర్చ ప్రారంభమైంది. అచ్చంపేట ఫలితాలపై అందరిలో ఆసక్తి నెలకొంది.



అచ్చంపేట పట్టణ వ్యూ

1962లో నియోజకవర్గం ఏర్పాటు..

1307 ఫసలీలో అమ్రాబాద్ తాలూకాగా ఉండేది. 1322 ఫసలీలో అచ్చంపేటకు మార్చారు. 1952, 1957 అసెంబ్లీ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్, కల్వకుర్తి ద్విసభ్య నియోజకవర్గాలతో అచ్చంపేట కలిసి ఉన్నది. 1962లో అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు కాగా.. షెడ్యూల్డ్ కులాలకు రిజర్వు చేశారు. మొదటి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ తరఫున కె.నాగన్న ఎన్నికయ్యారు. 2009లో చేపట్టిన నియోజకవర్గ పునర్విభజనలోనూ ఎస్సీలకే రిజర్వు అయింది. అచ్చంపేట, బల్మూర్, లింగాల, అమ్రాబాద్, ఉప్పునుంతల, వంగూరు మండలాలు పూర్తిగా అచ్చంపేట సెగ్మెంట్‌లోకి వచ్చి చేరాయి. పదర, చారకొండ కొత్త మండలాల ఏర్పాటుతో మొత్తం 8 మండలాలుగా నియోజకవర్గం ఉంది. 1962 నుంచి ఇప్పటి వరకు 13 సార్లు ఎన్నికలు జరిగితే.. 12సార్లు ఇక్కడ గెలిచిన పార్టీయే అధికారం చేపట్టింది. 2009లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తే.. ఇక్కడ మాత్రం టీడీపీ అభ్యర్థి పి.రాములు గెలుపొందడంతో చరిత్రకు గండి పడింది. 2014, 2018లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పార్టీకి ఇక్కడ పట్టం కట్టడంతో సెంటిమెంట్ కొనసాగుతోంది. ఇంతవరకు హ్యాట్రిక్ సాధించిన ఎమ్మెల్యేలు లేకపోవడం విశేషం.

వ్యక్తుల కంటే పార్టీలకే ప్రాధ్యానం..

అచ్చంపేట ఓటర్లు వ్యక్తుల కంటే పార్టీలకే ప్రాధాన్యమిస్తున్నారు. 1962 నుంచి 2018 వరకు జరిగిన ఎన్నికల్లో మూడు పార్టీలకే ఓటర్లు పట్టం కట్టారు.6సార్లు కాంగ్రెస్, 5సార్లు టీడీపీ, రెండు పర్యాయాలు టీఆర్ఎస్ విజయం సాధించాయి. 1967, 1972 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందిన మహేంద్రనాథ్ రెండు పర్యాయాలు మంత్రిగా పనిచేశారు.

అత్యధిక.. అత్యల్ప మెజార్టీ




ఇప్పటి వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధికంగా 46,181 ఓట్ల మెజార్టీ రాగా.. అత్యల్పంగా 2,609 ఓట్ల మెజార్టీ నమోదైంది. 1994లో టీడీపీ తరఫున పోటీచేసిన పి.రాములు 46,181 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 1989 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన డి.కిరణ్‌కుమార్ 2,609 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

1962 నుంచి 2018 వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన వారి వివరాలు..

సంవత్సరం	పేరు	పార్టీ	మెజార్టీ
1962	కె.నాగన్న	కాంగ్రెస్	5,433
1967	పి.మహేంద్రనాథ్	కాంగ్రెస్	12,502
1972	పి.మహేంద్రనాథ్	కాంగ్రెస్	17,686
1978	ఆర్ఎం మనోహర్	కాంగ్రెస్.ఐ	9,310
1983	పి.మహేంద్రనాథ్	టీడీపీ	10,316
1985	మహేంద్రనాథ్	టీడీపీ	34,445
1989	డి.కిరణ్‌కుమార్	కాంగ్రెస్	2,609
1994	పి.రాములు	టీడీపీ	46,181
1999	పి.రాములు	టీడీపీ	12,346
2004	వంశీకృష్ణ	కాంగ్రెస్	20,665
2009	పి.రాములు	టీడీపీ	5,101
2014	గువ్వల బాలరాజు	టీఆర్ఎస్	11,821
2018	గువ్వల బాలరాజు	టీఆర్ఎస్	9,556

ఓటర్ల వివరాలు..

పురుషులు:	మహిళలు:	
1,17,124	1,16,439	
ఇతరులు: 2	సర్వీస్ ఓటర్లు: 173	మొత్తం: 2,33,738
పోలింగ్ కేంద్రాలు: 265		



2018 ఎన్నికల్లో..

గువ్వల బాలరాజు (టీఆర్ఎస్): 87,841	చిక్కుడు వంశీకృష్ణ (కాంగ్రెస్): 78,285
మేడిపల్లి మల్లేష్ (బీజేపీ): 3,196	నోటా: 2,403

భౌగోళికంగా..

అచ్చంపేట నియోజకవర్గం జిల్లాలోనే చాలా పెద్దది. అమ్రాబాద్ పులుల అభయారణ్యం 2611.39 చదరపు కి.మీ. విస్తీర్ణంలో ఉంది. ఇందులో 2166.37 చదరపు కి.మీ. అభయారణ్యం, 445.02 చదరపు కి.మీ. బఫర్ జోన్‌గా ఏర్పాటు చేశారు. ప్రసిద్ధి చెందిన ఆలయాలు, అరుదైన వన్య ప్రాణులు, వనమూలికలు, అటవీ ఉత్పత్తులు, సహజ వనరులు ఇక్కడ ఉన్నాయి.

బీసీలు, ఎస్సీలే కీలకం..

నియోజకవర్గంలో ఎస్సీ, బీసీ ఓటర్లు గెలుపోటములను ప్రభావితం చేసే అవకాశం ఉంది. కులాల వారీగా పరిశీలిస్తే.. 2,33,565 మంది ఓటర్లలో ప్రధాన సామాజిక వర్గాలైన ఎస్సీలు 60వేలు, బీసీలు లక్ష 15వేలు, ఎస్టీలు 32వేలు, రెడ్డి, వైశ్యులు 20వేలు, ముస్లిం, మైనార్టీలు 7వేల మంది ఓటర్లు ఉన్నారు.

స్థానికేతరులకే పట్టం..



పుట్టపాగ మహేంద్రనాథ్

అచ్చంపేట నియోజకవర్గానికి మరో ప్రత్యేకత ఉంది. నియోజకవర్గం నుంచి ఇప్పటి వరకు ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారు ఎక్కువగా స్థానికేతరులే ఉన్నారు. మొత్తం 13సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే.. 10సార్లు స్థానికేతరులు ఎన్నిక కావడం విశేషం. 1994, 1999, 2004 ఎన్నికల్లో మాత్రమే స్థానికులైన పి.రాములు, చిక్కుడు వంశీకృష్ణలు ఎన్నికయ్యారు. 1962లో కె.నాగయ్య, 1978లో హైదరాబాద్‌కు చెందిన ఆర్ఎం మనోహర్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1967, 1972, 1983, 1985 ఎన్నికల్లో కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెద్దకొత్తపల్లి మండలం జొన్నలబొగడకు చెందిన పుట్టపాగ మహేంద్రనాథ్ ఎన్నిక కాగా, 1989లో నాగర్‌కర్నూల్ మండలం శాయిన్‌పేటకు చెందిన డి.కిరణ్‌కుమార్ ఎన్నికయ్యారు. 2009లో చేపట్టిన నియోజకవర్గాల పునర్విభజనలో అచ్చంపేట సెగ్మెంట్ పరిధిలో ఉన్న ఎమ్మెల్యే పి.రాములు స్వగ్రామమైన గుండూరు.. కల్వకుర్తి నియోజకవర్గంలోకి చేరడంతో ఆయన స్థానికేతరుడు అయ్యారు. 2014, 2018 ఎన్నికల్లో గెలిచిన గువ్వల బాలరాజుది వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం పొల్కెపహాడ్ గ్రామం.

2009లో అప్పాపూర్‌లో పోలింగ్ బూత్..

నల్లమల అభయారణ్యంలోని అప్పాపూర్ చెంచుపెంటలో 2009 అసెంబ్లీ ఎన్నికల్లో మొదటిసారిగా పోలింగ్ బూత్ ఏర్పాటు చేశారు. అప్పాపూర్ ఆశ్రమ పాఠశాలలో 180/182ను పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడంతో 12 చెంచుపెంటలకు చెందిన గిరిజనులు మొదటి సారి ఓటుహక్కు వినియోగించుకున్నారు.

పాతవాటికి రంగులు వేస్తే అభివృద్ధా?

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలో ఏ వర్గం సంతోషంగా లేరని, పాతవాటికి రంగులు వేసి అభివృద్ధి అంటే ఎట్లా అని కాంగ్రెస్ అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ మండల పరిధిలోని బొక్కలోనిపల్లిలో జమిస్తాపూర్ ఎంపీటీసీ నాగరాజు, వార్డు సభ్యులు, ఓబులాయిపల్లి గ్రామాల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు యెన్నం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, నాయకులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో పలు వార్డులు, హన్వాడ మండలంలోని పలు గ్రామాల వారు యెన్నం సమక్షంలో పార్టీలో చేరారు.

మోసగాళ్లు.. అభివృద్ధి ప్రదాతకు మధ్య యుద్ధం



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

నవాబుపేట: మోసగాళ్లకు.. అభివృద్ధి ప్రదాతకు మధ్య జరుగుతున్న యుద్ధంలో ప్రజలు ఏ పక్షాన ఉంటారో నిర్ణయించుకోవాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సూచించారు. సోమవారం సిద్దోటం, తీగలపల్లి, హన్మసానిపల్లి, కూచూర్ గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ప్రసంగించారు. కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలన్నారు. కేసీఆర్‌ను బలపర్చాలని సూచించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. మండల అధ్యక్షుడు నర్సింహులు, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, మధుసూదన్‌రెడ్డి, రాంప్రసాద్, పురుషోత్తం, చెన్నయ్య, యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మిడ్జిల్: ఎంపీపీ సుదర్శన్ సోమవారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రెడ్డి, జగన్, కేశవ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రచారం

సాక్షి నెట్‌వర్క్: కాంగ్రెస్ అభ్యర్థి జి.మధుసూదన్ రెడ్డి, నాయకులు నియోజకవర్గ పరిధిలో ని వివిధ గ్రామాల్లో సోమవారం ప్రచారం చేశారు. వేముల మాజీ సర్పంచ్ రేవతి, గోపన్‌పల్లి, గుడిబండ, మీనుగోనిపల్లి మాజీ సర్పంచ్‌లు, పెద్దవడ్డేమాన్ సర్పంచ్ పర్వీనా బేగంతో పాటు పలువురు సోమవారం పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే సీతా దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా మధుసూదన్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో బీ– ఫాం అందుకున్నారు.

హామీలతో జిమ్మిక్కులు

గండీడ్/మహమ్మదాబాద్: పరిగి మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సోమవారం ఉమ్మడి మండల పరిధిలోని గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ బోగస్ హామీలతో జిమ్మిక్కులు చేస్తున్నాడని ఆరోపించారు. వివిధ గ్రామాల నాయకులు పార్టీలో చేరారు. జూలపల్లిలో సీపీఎం నాయకులు పార్టీకి మద్దతు పలికారు. పీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాములు, మండలాల అధ్యక్షులు జితేందర్‌రెడ్డి, నారాయణ, జిల్లా వైస్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శాంతి తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే సేవకుడిగా పనిచేస్తా

హన్వాడ: ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే సేవకుడిగా పనిచేస్తానని బీజేపీ అభ్యర్థి మిథున్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం శేక్‌పల్లి, ఎల్లంబాయి తండా, అయోధ్యనగర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల ద్వారానే గ్రామాల్లో సీసీరోడ్లు, డంపింగ్‌యార్డులు, శ్మశానవాటికలను ఇక్కడి ప్రభుత్వం నిర్మించి గొప్పలు చెప్పుకుంటుందని విమర్శించారు. జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి కొండాబుచ్చిరెడ్డి, మండల అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: బీజేపీ అభ్యర్థి మిథున్ రెడ్డి సతీమణి రష్మిక సోమవారం మండలంలోని



శేక్‌పల్లిలో మిథున్‌రెడ్డి ప్రచారం

ధర్మాపూర్, చౌదర్‌పల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు. సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, శంకరమ్మ, బీజేపీ జిల్లా కోశాధికారి పాండురంగారెడ్డి, మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు జయశ్రీ, మండల అధ్యక్షుడు రాజుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎంవీఎస్ కళాశాలలో 'తొలిమెట్టు'



శిక్షణలో పాల్గొన్న వలంటీర్లు, అధికారులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో తొలిమెట్టు కార్యక్రమంపై కళాశాల వలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు విద్యను బోధించడం నాయకత్వ లక్షణాలు మెరుగుపడతాయన్నారు. పాఠశాలల్లో డ్రాప్ అవుట్స్ తగ్గించి, విద్యార్థుల్లో సామర్థ్యం పెంపొందిచేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రవీణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేయాలి

మిడ్జిల్: రాష్ట్రంలో బీజేపీ గెలుపుకోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని జడ్చర్ల అభ్యర్థి చిత్తరంజన్‌దాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. చిత్తరంజన్‌దాస్ మాట్లాడుతూ ప్రజలు డబుల్ ఇంజన్ సర్కార్‌ను కోరుకుంటున్నారని అన్నారు. మండల అధ్యక్షుడు నరేందర్, నాయకులు పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిన నాయకులు

కోయిల్‌కొండ: మండలంలోని వివిధ గ్రామపంచాయతీల నుంచి పెద్ద ఎత్తున సోమవారం బీఆర్ఎస్ నాయకులు నారాయణపేటలో సీఎం కేసీఆర్ ఆశీర్వాదసభకు తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక భవన్ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీరాంమూర్తి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. యశోద ఆస్పత్రి హైదరాబాద్(హైటెక్ సిటీ) వారి ఆధ్వర్యంలో నిర్వహించే శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధికారంలోకి రావడం ఖాయం



కోయిల్‌కొండ: కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని నారాయణపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుంభం శివకుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం పారుపల్లి, రాంపూర్, గార్లపహాడ్, దమాయపల్లి, అభంగపట్నం, కనాయపల్లి, లింగుపల్లి, గంగ్యానాయక్ తండాల్లో అభ్యర్థి చిట్టెం పర్ణికారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. విద్యాసాగర్, జి.రవీందర్, దశరథరెడ్డి, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికకు రంగం సిద్ధం



జడ్చర్ల: బీజేపీ టికెట్ ఆశించి భంగపడిన నాయకురాలు బాలత్రిపుర సుందరి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆమె టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి, కాంగ్రెస్ అభ్యర్థి అనిరుధ్‌రెడ్డి తదితరులతో సోమవారం మంతనాలు జరిపారు. ఈనెల 9న పార్టీలో చేరనున్నట్లు నాయకులు తెలిపారు. మాజీ జెడ్పీటీసీ రబ్బానీ, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వస్తే పథకాలు ఖతమే



మాచన్‌పల్లి తండాలో గులాబీ జెండాలమ్మ పాటకు వృద్ధుడితో కలిసి స్టెప్పులు వేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్రాన్ని యాభై ఏళ్లు పాలించిన కాంగ్రెస్ ప్రజలకు చేసిందేమీలేదని... ఇప్పుడు అధికారంలోకి వస్తే పథకాలను ఖతం చేస్తారని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం రేగడిగడ్డ తండా, మాచన్‌పల్లి తండా, వెంకటాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు అనేక కష్టాలు అనుభవించారని గుర్తుచేశారు. మాజీ మంత్రి పి.చంద్రశేఖర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్, ఎంపీపీ సుధాశ్రీ, వైస్ ఎంపీపీ కె.అనిత, ముడా డైరెక్టర్ ఆంజనేయులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: కోడూర్‌లో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రచారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డీసీసీబీ డైరెక్టర్ నర్సిములు, గ్రామ అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్, మణ్యంకొండ పాలక మండలి సభ్యుడు చిన్నయ్యగౌడ్, సింగిల్‌విండో డైరెక్టర్ కృష్ణయ్య పాల్గొన్నారు.

పిస్తాలో చాయ్ తాగిన మంత్రి...

సీఎం కేసీఆర్ పర్యటన ముగిన వెంటనే మంత్రి శ్రీనివాస్‌గౌడ్ బైపాస్‌లో ఉన్న పిస్తా హౌస్‌లో చాయ్ తాగారు. పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య కూర్చొని కాసేపు సరదాగా గడిపారు.

క్రీడాకారులు అంతర్జాతీయస్థాయికి ఎదగాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయస్థాయికి ఎదగాలని మున్సిపల్ చైర్మన్ కేసీ.నర్సింహులు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎండీసీఏ మైదానంలో ఈనెల 11 వరకు నిర్వహించనున్న 2వ జలజం సత్యనారాయణ టీ–10 క్రికెట్ టోర్నీ సోమవారం ప్రారంభమైన సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జలజం సత్యనారాయణ విద్యాభివృద్ధి, క్రీడల భివృద్ధికి ఎంతో కృషి చేసినట్లు తెలిపారు. ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, లిటిల్ స్కాలర్స్ స్కూల్ డైరెక్టర్ జలజం విదూషిరాయ్, ఎండీసీఏ ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, వెంకటరామారావు, సంయుక్త కార్యదర్శి క్రిష్ణమూర్తి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు, ప్రిన్సిపాల్ రవీందర్ పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ తదితరులు

కాంగ్రెస్‌కు మూకుమ్మడి రాజీనామాలు

దేవరకద్ర: దేవరకద్ర నియోజకవర్గంలోని పలువురు కాంగ్రెస్ నాయకులు సోమవారం మూకుమ్మడిగా పార్టీకి రాజీనామాలు చేశారు. పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ పార్టీలో 30ఏళ్లుగా ఉంటూ పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసినా తగిన గుర్తింపు ఇవ్వడం లేదన్నారు. పార్టీలో ఇంకా కొనసాగితే భవిష్యత్ అగమ్యగోచరంగా ఉండేలా ఉందని భావించి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. తనతో పాటు మాజీ జెడ్పీటీసీ వేణుగోపాల్, మాజీ వైస్ఎంపీపీ భగవంత్‌గౌడ్, మండల అధ్యక్షుడు దేవరకద్ర రాందాసు, చిన్నచింతకుంట వెంకటేశ్వర్‌రెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు బాల్‌చందర్‌గౌడ్, ఎంపీటీసీ శివరాజు, ఫసియొద్దీన్, కావాలి అశోక్‌గౌడ్, రంజిత్‌గౌడ్, క్రాంతిగౌడ్ తదితరులు పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.



బీఆర్ఎస్‌లో చేరుతున్న కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్

కేసీఆర్ సమక్షంలో గులాబీ గూటికి..

దేవరకద్రలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ తన మద్దతుదారులతో కలిసి గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరగా, సీఎం కేసీఆర్ గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు.

బీజేపీలోకి కొండా ప్రశాంత్‌రెడ్డి

దేవరకద్ర రూరల్: దేవరకద్ర నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు కొండా ప్రశాంత్‌రెడ్డి సోమవారం పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. హైదరాబాద్‌లో గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, బీజేపీ అధికార ప్రతినిధి ప్రకాష్‌రెడ్డిల సమక్షంలో ప్రశాంత్‌రెడ్డి పార్టీలో చేరారు. కాగా పార్టీ కోసం ఎంతో కృషి చేసినా కనీస విలువ ఇవ్వలేదని, సరైన గుర్తింపు, గౌరవం లేనిచోట ఉండలేనని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి పంపించిన లేఖలో ఆయన పేర్కొన్నారు.



బీజేపీలో చేరుతున్న కొండా ప్రశాంత్‌రెడ్డి

దేవరకద్ర నుంచి బీజేపీ ఎమ్మెల్యే టికెట్‌పై స్పష్టమైన హామీ ఇవ్వడంతోనే ఆయన తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరినట్లు తెలుస్తోంది.